సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 12 । అక్టోబర్ । 2024



వారే లేని.. నేనెందుకుని..
రెండ్రోజుల క్రితం భర్త, ఇద్దరు కుమారులు నీట మునిగి మృత్యువాత పడ్డారు. తీవ్ర మనస్తాపంతో ఆ ఇల్లాలు జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. 6లో ▸



విత్తన రకం కోతకు సిద్ధం
ముందుగా నాట్లువేసిన విత్తన రకాలు కొన్నిచోట్ల మాసూళ్లకు సిద్ధమయ్యాయి. ఎకరాకు 30 బస్తాల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. 6లో ▸



10 కాసుల బంగారం చోరీ
పాలకొల్లు సూర్యతేజస్ నగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి 10 కాసుల బంగారం దోచుకున్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. 6లో ▸

టెండర్లన్నీ సిండికేట్లవే!

- ముగిసిన మద్యం టెండర్ల ప్రక్రియ
- మొత్తం 10,795 దరఖాస్తులు
- ఏలూరు జిల్లాలో 144 షాపులకు 5,433, పశ్చిమలో 175 షాపులకు 5362
- జిల్లా సరిహద్దుల్లోని షాపులకు భారీ డిమాండ్
- 14న ఏలూరు, భీమవరంలో డ్రా
- అన్నీ తమవారికే దక్కేలా కూటమి నేతల ఎత్తుగడ
- బయటి వ్యక్తులు వేయకుండా బెదిరింపులు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మద్యం షాపులకు టెండర్ల ప్రక్రియ శుక్రవారం రాత్రి 7 గంటలతో ముగియగా.. ఎమ్మెల్యేలు, కూటమి నేతలు పెద్ద ఎత్తున రాజకీయం నడిపి దాదాపు టెండర్లన్నీ తమ సిండికేట్లే వేసేలా ఎత్తుగడ వేశారు. సిండికేట్‌తో సంబంధం లేని వ్యక్తులు టెండర్లు వేయాలని చూస్తే బెదిరింపులతో కట్టడి చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 319 మద్యం దుకాణాలకు మొత్తం 10,795 దరఖాస్తులు వచ్చినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీలత చెప్పారు. కూటమి ప్రభుత్వంలో ఇతర వ్యక్తులు ఎవరూ మద్యం వ్యాపారాలు చేయకుండా ఎమ్మెల్యేలు, నేతలు రంగంలోకి దిగారు. మద్యం షాపులకు టెండర్లు వేయకుండా బెదిరింపుల పర్వం కొనసాగిస్తూ మద్యం దుకాణాలన్నీ తామే నిర్వహించేలా రింగ్ అయ్యారు. ఏలూరు జిల్లాలో 144 ప్రైవేటు మద్యం దుకాణాలకు 5,433 టెండర్లు వేయగా, పశ్చిమగోదావరి జిల్లాలో 175 ప్రైవేటు మద్యం షాపులకు 5362 టెండర్లు వేసినట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. తొలుత మద్యం షాపులకు టెండర్లు దాఖలు చేయకుండా ఎక్సైజ్ అధికారులపై సైతం ఒత్తిడి తెస్తూ ఆఫ్‌లైన్ దరఖాస్తులు వేయకుండా నిలువరించారు. అక్టోబర్ 2న ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో మద్యం షాపులకు టెండర్లు ప్రక్రియ ప్రారంభించగా 11తో ముగిసింది. ఈనెల 14న ఏలూరు మినీ బైపాస్‌లోని చలసాని గార్డెన్స్‌లో లాటరీ ద్వారా మద్యం షాపులను కేటాయించేలా అధికారులు చర్యలు చేపట్టారు. అలాగే భీమవరం పట్టణ శివారు నిర్మలాదేవి ఫంక్షన్ హాల్లో డ్రా తీస్తారు.

సరిహద్దుల్లో షాపులకు డిమాండ్..

ఏలూరు జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో ప్రైవేటు మద్యం షాపులకు డిమాండ్ పెరిగింది. పోలవరం నియోజకవర్గంలో చూస్తే పోలవరం మండలంలో 3 మద్యం షాపులకు ఏకంగా 150కి పైగా దరఖాస్తులు వచ్చాయి. కొయ్యలగూడెం మండలంలో 5 షాపులకు ఏకంగా 260 టెండర్లు వేయగా, బుట్టాయగూడెం మండలంలో 4 షాపులకు 174 దరఖాస్తులు రావటం విశేషం. ఇక చింతలపూడి నియోజకవర్గంలో టీ.నరసాపురం మండలంలో 3 షాపులకు 154 టెండర్లు, లింగపాలెం మండలంలో 4 షాపులకు 165 దరఖాస్తులు సమర్పించారు. ఉంగుటూరు మండలంలో 7 షాపులకు 270 దరఖాస్తులు వేసినట్లు చెబుతున్నారు. భీమడోలు మండలంలో 7 షాపులకు 385 టెండర్లు దాఖలు అయ్యాయి. ఆగిరిపల్లి మండలంలో 4 షాపులకు 165 దరఖాస్తులు వేస్తే... చాట్రాయి మండలంలో 2 షాపులకు 120 టెండర్లు వేసినట్లు తెలుస్తోంది.

దెందులూరులో దౌర్జన్య పర్వం

దెందులూరు నియోజకవర్గంలోని 37, 38 మద్యం షాపులకు రెండేసి మాత్రమే దరఖాస్తులు వేయడంతో కొందరు వ్యక్తులు ఈ షాపులకు టెండర్లు సమర్పించేందుకు ఏలూరు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయానికి ఎమెల్యే చింతమనేని అనుచరులు వారిపై దౌర్జన్యానికి దిగినట్లు సమాచారం. ఏకంగా వంద మందికి పైగా కార్లు, మోటారు సైకిళ్లపై వచ్చి వారిపై దాడి చేసేందుకు ప్రయత్నించినట్లు బాధితులు చెబుతున్నారు. 38వ షాపుకు సంబంధించి టోకెన్ ఇవ్వగా, మరో షాపునకు మాత్రం టోకెన్ ఇవ్వలేదని అంటున్నారు. అనంతరం దెందులూరు ఎమ్మెల్యే అనుచరులు డీడీల్లోని వివరాల ఆధారంగా వ్యక్తులకు ఫోన్ చేసి ఇంటి అడ్రస్ చెప్పాలంటూ బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తున్నారు. టెండర్లు వేసిన వ్యక్తులను బెదిరిస్తూ ఎవరు వచ్చినా తమను చేసేదేమీ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా టెండర్లు

ఏలూరు 26 షాపులకు 455	ఉంగుటూరు 17 షాపులకు 816
దెందులూరు 15 షాపులకు 283	నూజివీడు 16 షాపులకు 673
చింతలపూడి 24 షాపులకు 1,203	కైకలూరు 21 షాపులకు 588
పోలవరం 20 షాపులకు 1,136	గోపాలపురం 5 షాపులకు 279 టెండర్లు

మద్యం దుకాణాల డ్రాపై సమీక్ష



నిర్మలాదేవి ఫంక్షన్ హాల్లో లాటరీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

భీమవరం: నూతన మద్యం పాలసీలో భాగంగా మద్యం దుకాణాలకు లాటరీ నిర్వహణ పారదర్శకంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మద్యం షాపుల డ్రాకు సంబంధించిన ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 14న భీమవరం పట్టణ శివారు నిర్మలాదేవి ఫంక్షన్ హాల్లో డ్రా నిర్వహిస్తామని దీనికి సంబంధించిన ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాంగం లేకుండా ముందస్తుగా జనరేటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డబ్బులు లెక్కించడానికి అవసరమైన లెక్కింపు యంత్రాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. 11వ తేదీ సాయంత్రం వరకు సుమారు 4,400 దరఖాస్తులు వచ్చాయని దరఖాస్తులు 12, 13 తేదీలలో పరిశీలించి 14న లాటరీ తీస్తామని చెప్పారు.

మద్యం షాపుల లాటరీకి ఏర్పాట్లు

భీమవరం: మద్యం షాపుల కేటాయింపునకు నిర్వహించే లాటరీ విధానంలో ఎలాంటి ఇబ్బందిలేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం భీమవరం పట్టణ శివారులోని నిర్మలాదేవి ఫంక్షన్‌హాల్లో ఈనెల 14న నిర్వహించే లాటరీ విధానానికి సంబంధించిన ఏర్పాట్లును శుక్రవారం రాత్రి పరిశీలించారు. జిల్లా ఎక్సైజ్‌శాఖాధికారి ఆర్‌ఎస్ కుమరేశ్వరన్, సహాయ ఎక్సైజ్ అధికారి ప్రసాదరెడ్డి, భీమవరం డీఎస్పీ ఆర్‌జి జయసూర్య పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కలెక్టర్ దసరా శుభాకాంక్షలు



చదలవాడ నాగరాణి, కలెక్టర్

భీమవరం (ప్రకాశంచౌక్): విజయ దశమి పండుగ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ పర్వదినాన దుర్గాదేవి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

రతన్‌టాటాకు భారతరత్న ఇవ్వాలి

మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటాకు భారతరత్న ఇవ్వాలని మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. భారతదేశంతోపాటు ప్రపంచంలో వందకు పైగా దేశాలలో పరిశ్రమలను స్థాపించి ఎన్నో లక్షల మందికి రతన్‌టాటా ఉపాధి కల్పించారని సమాజసేవ, దాతృత్వం, ఉదారతలో ఆయనకు ఆయనే సాటి అని అభివర్ణించారు.

జిల్లాలో 20 మి.మీ. వర్షపాతం

భీమవరం: జిల్లా వ్యాప్తంగా గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకూ సరాసరి 20.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పాలకొల్లులో అత్యధికంగా 60.4 మిల్లీమీటర్లు, పోడూరులో 58.4, తాడేపల్లిగూడెంలో 8.4, పెంటపాడులో 8.2, తణుకులో 15.2, అత్తిలిలో 24.8, ఆకివీడులో 6.4, ఉండిలో 9.4, పాలకోడేరులో 7.2, పెనుమంట్రలో 25.4, ఇరగవరంలో 11.4, పెనుగొండలో 32.2, ఆచంటలో 25.4, వీరవాసరంలో 16.4,భీమవరంలో 14.4, కాళ్లలో 7.8, మొగల్తూరులో 16.2, నరసాపురంలో 14.4,యలమంచిలిలో 25.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

దేవస్థానం సెక్యూరిటీ గార్డ్ నిజాయతీ



పోగొట్టుకున్న పర్సును భక్తురాలికి అందజేస్తున్న సెక్యూరిటీ గార్డు శివప్రసాద్

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ఒక భక్తురాలు పోగొట్టుకున్న పర్సును దేవస్థానం సెక్యూరిటీ గార్డు నిజాయతీగా తిరిగి అందించాడు. ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో శుక్రవారం ఒక భక్తురాలు తన పర్సు పోగొట్టుకుంది. దాని కోసం ఎంత వెదికినా ఫలితం దక్కలేదు. ఆలయ ఆవరణలో విధులు నిర్వర్తిస్తున్న సెక్యురిటీ గార్డు శివప్రసాద్‌కు ఆ పర్సు దొరికింది. అందులో రూ.15 వేలు ఉన్నట్టు గుర్తించిన అతడు, ఆ పర్సును నిజాయతీగా బాధిత భక్తురాలికి ఆలయ కార్యాలయంలో అందించాడు. దాంతో శివప్రసాద్‌ను పలువురు భక్తులు, ఆలయ అధికారులు అభినందించారు.

నిజాయతీ చాటుకున్న ఆటోడ్రైవర్

భీమవరం: ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ తన బ్యాగ్‌ను మరిచిపోగా ఆటోడ్రైవర్ నిజాయతీగా ఆ బ్యాగ్‌ను తిరిగి అందజేశాడు. భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన దండు పద్మావతి ఆమెరికా వెళ్తున్నందున తన బ్యాగ్‌లో విమానం టికెట్, రూ. 5 వేలు నగదు, సెల్‌ఫోన్ పెట్టుకుని భీమవరంలో ఆటోలో తిరిగి బ్యాగ్‌ను మర్చిపోయారు. దీంతో కంగారుపడిన పద్మావతి టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ జి.కాళీచరణ్ వెంటనే స్పందించి ఏఎస్సై ఎం.మోహనరావు, కానిస్టేబుల్ నర్సింహరావులను ఆటోను గుర్తించాల్సిందిగా ఆదేశించారు. అయితే ఆటో డ్రైవర్ కూడా బాధిత మహిళ కోసం వెదుకుతుండగా పోలీసులు గుర్తించి బ్యాగ్‌ను మహిళకు అందచేశారు.

రొయ్యల వ్యాపారి రూ.14 కోట్ల టోకరా

భీమవరం: భీమవరం పట్టణంలో వడ్డీ వ్యాపారులకు రొయ్యల వ్యాపారి రూ.14 కోట్ల మేర టోకరా వేసినట్లు ప్రచారం జరుగుతోంది. పెద్ద మొత్తంలో రొయ్యలు కొనుగోలు చేసినట్లు ఒక కంపెనీకి చెందిన నకిలీ రసీదులు తయారు చేయించి వడ్డీ వ్యాపారులకు చూపించాడు. దీంతో వడ్డీ వ్యాపారులు నమ్మి సొమ్ములిచ్చారు. అయితే నెలలు గడిచిపోతున్నా వ్యాపారి నుంచి సొమ్ములు రాకపోవడంతో అనుమానంతో వడ్డీ వ్యాపారులు ఆక్వా కంపెనీ వద్ద ఆరా తీయగా ఆ వ్యక్తి కంపెనీకి రొయ్యలు విక్రయించలేదని తెలియడంతో వడ్డీ వ్యాపారులు లబోదిబోమంటున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయకుండా పెద్ద మనుషుల సమక్షంలో డబ్బు రాబట్టాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

ఆడపిల్లల భద్రత అందరి బాధ్యత



బాలికా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

భీమవరం (ప్రకాశంచౌక్): బాలికలకు అన్ని విధాలా అండగా నిలవడంతోపాటు, వారికి మంచి భవిష్యత్తును కల్పించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరు క్యాంపు కార్యాలయంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా గోడ ప్రతులను జిల్లా కలెక్టరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికలకు సామాజికంగా, ఆర్థికంగా, మానసికంగా భరోసానివ్వాలని పిలుపునిచ్చారు. జిల్లా యంత్రాంగం తరపున బాల బాలికలకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. బాలికలకు రక్షణ కల్పించడంతోపాటు వారికి చక్కని చదువు, ఆరోగ్యం అందించాలని, వారి సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఐసీడీఎస్ పీడీ పి.సుజాతా రాణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆర్. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

జంగారెడ్డిగూడెం: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు శుక్రవారం పట్టణంలోని బుట్టాయగూడెం రోడ్‌లో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా టీవీఎస్ మోపెడ్‌పై 240 కేజీల బియ్యాన్ని తరలించడాన్ని గుర్తించి, బియ్యాన్ని, మోపెడ్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

కన్యకా పరమేశ్వరి అమ్మవారికి చెమటలు



అమ్మవారికి చెమటలు పట్టిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా జంగారెడ్డిగూడెం శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని శుక్రవారం మహిషాసుర మర్దనిగా అలంకరించి పూజలు నిర్వహిస్తున్న సమయంలో అమ్మవారు తన మహిమను చూపించారు. వాసవీ మాత విగ్రహానికి చెమటలు పట్టడంతో అది చూసిన భక్తులు ఆనందపరవశులయ్యారు. ఈ దృశ్యాన్ని చూసేందుకు భక్తులు ఆసక్తి చూపించారు.

● ఇటు చిరుజల్లు.. అటు హరివిల్లు




తణుకులో శుక్రవారం ఇంద్రధనుస్సు ఆవిష్కృతమైంది. ఒక పక్క ఎండ... మరో పక్క వర్షంతో ఒక్కసారిగా వాతావరణం మారగా.. నింగిలో విరిసిన హరివిల్లు అలరించింది. అత్తిలి మండలం గుమ్మంపాడు గ్రామంలోని శుక్రవారం సాయంత్రం ఈ దృశ్యం కనువిందు చేసింది. - తణుకు

● జయ జయహే..



ఆకివీడు : మహిషాసుర మర్దనిగా పెద్దింటి అమ్మవారు

దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శుక్రవారం మహిషాసుర మర్దనిగా భక్తులకు దర్శనమిచ్చారు. అష్ట భుజాలతో సింహ వాహినిగా అవతరించి, దుష్టుడైన మహిషాసురుడిని సంహరించే మహిషాసుర మర్దనిగా భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. - సాక్షి నెట్‌వర్క్



భీమవరం(ప్రకాశం చౌక్) : శ్రీమహిషాసుర మర్దని అమ్మవారి అలంకరణలో మావుళ్లమ్మ



తాడేపల్లిగూడెం(టీఏసీ): మహిషాసుర మర్దని దేవిగా బలుసులమ్మ

బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలు



- రేపటి నుంచి ద్వారకాతిరుమలలో ప్రారంభం
- 17న రాత్రి 8 గంటల నుంచి స్వామి వారి తిరుకల్యాణం
- 18న రాత్రి 7 గంటల నుంచి రథోత్సవం

ద్వారకాతిరుమల: అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడి వైభవాన్ని చాటే శ్రీవారి బ్రహ్మోత్సవాలు క్షేత్రంలో ఈ నెల 13 నుంచి ప్రారంభం కానున్నాయి. చిన్నతిరుపతిగా పేరొందిన ద్వారకాతిరుమల దివ్య క్షేత్రంలో స్వామివారికి ఏటా రెండు పర్యాయాలు (వైశాఖ, ఆశ్వీయుజ మాసాల్లో) ఈ బ్రహ్మోత్సవాలను వైఖానస ఆగమోక్తంగా జరపడం సంప్రదాయంగా వస్తోంది. అందులో భాగంగా ఈనెల 13 నుంచి 20 వరకు ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి సారి 8 రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాలు జరిగే రోజుల్లో స్వామివారు ఉభయ దేవేరులతో కలసి ఉదయం, సాయంత్రం వేళల్లో పలు వాహనాలపై తిరువీధుల్లో విహరించనున్నారు. ఆలయ ముఖ మండపంలో శ్రీవారు రోజుకో విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలోని శ్రీహరి కళాతోరణ వేదికపై ఉదయం నుంచి రాత్రి వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని క్షేత్రం విద్యుద్దీప కాంతులతో దగదగలాడుతోంది. మిగిలిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి.



ద్వారకాతిరుమలలో విద్యుద్దీపాలతో కాంతులీనుతున్న శ్రీవారి ఆలయం

క్షేత్రానికి ఇలా చేరుకోవాలి

సుదూరప్రాంతాల భక్తులు రైల్వే మార్గంలో ద్వారకాతిరుమలకు 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న భీమడోలు రైల్వేస్టేషన్‌కు చేరుకొని అక్కడినుంచి ఆర్టీసీ బస్సులు, ఆటోల ద్వారా క్షేత్రానికి చేరుకోవాలి. ఏలూరు, నరసాపురం, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి బస్సులు అందుబాటులో ఉన్నాయి.

ఉత్సవాల షెడ్యూల్

- ఈనెల 13న ఉదయం శ్రీవారిని పెండ్లి కుమారునిగా, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా చేయడంతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. ఆ రోజు రాత్రి 7 గంటలకు గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం
- 14న రాత్రి ధ్వజారోహణ, రాత్రి 9 గంటలకు హంసవాహనంపై స్వామివారి గ్రామోత్సవం
- 16న ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం, రాత్రి 7 గంటల నుంచి ఎదుర్కోలు ఉత్సవం
- 17న రాత్రి 8 గంటల నుంచి శ్రీ స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం, అనంతరం వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవం
- 18న రాత్రి 7 గంటల నుంచి రథోత్సవం
- 19న ఉదయం 7 గంటలకు చక్రస్నానం, రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణ
- 20న ఉదయం 9 గంటలకు చూర్ణోత్సవం, వసంతోత్సవం, రాత్రి 7 గంటలకు ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, పవళింపుసేవ, శ్రీపుష్ప యాగం కార్యక్రమాలు జరుగుతాయి.

ప్రత్యేక అలంకారాలు ఇవీ..

- 13న శ్రీ మహావిష్ణువు
- 14న బక సంహారం
- 15న వాల్మీకంలో శ్రీనివాసుడు
- 16న వామనావతారం
- 17న మోహిని
- 18న రాజమన్నార్
- 19న యశోదాకృష్ణ
- 20న శయన మహావిష్ణువు



క్లుప్తంగా

10 కాసుల బంగారం చోరీ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక సూర్యతేజస్ నగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి 10 కాసుల బంగారం దోచుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యతేజస్ నగర్‌లోని ఒక పోర్షన్‌లో కాపవరపు వర లక్ష్మీదేవి, ఆమె కుమార్తె, పక్క పోర్షన్‌లో వరలక్ష్మీదేవి వదిన పి.లలితాదేవి ఉంటున్నారు. ఆమె అన్నయ్య దుబాయ్‌లో ఉన్నారు. ఈ నెల 9న వరలక్ష్మీదేవి తన కుమార్తెను తీసుకుని బంధువుల ఇంటికి యలమంచిలి వెళ్లారు. లలితాదేవి విజయవాడ దుర్గ గుడికి వెళ్లారు. మరుసటి రోజు ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడంతో బంగారు వస్తువులు సుమారు 10 కాసులు పోయినట్టు గుర్తించారు. సీఐ కోలా రజనీకుమార్ కేసు దర్యాప్తు చేపట్టారు.

బెదిరింపులు తాళలేక మహిళ ఆత్మహత్య

భీమడోలు: అప్పుగా తీసుకున్న డబ్బును తిరిగి ఇవ్వాలని అడిగితే కేసులు పెట్టి ఇరికిస్తామని బెదిరించడంతో ఓ మహిళ తీవ్ర మనస్తాపానికి గురై గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. ఆగడాలలంకకు చెందిన యాళ్ల ప్రమీల (39) ఏలూరులోని స్వీట్ మ్యాజిక్ షాపులో పని చేస్తూ వచ్చిన డబ్బులతో చీటీలు కట్టుకుంటోంది. ఇలా వచ్చిన సొమ్మును ఏలూరు సమీపంలోని వంకాయగూడెంకు చెందిన సరిపల్లి ప్రేమ, తులసి, కానుమోలు గ్రామానికి చెందిన ప్రేమ అన్నదమ్ములు రత్నబాబు, కిరణ్‌లకు రూ.8 లక్షల వరకు అప్పుగా ఇచ్చింది. ఇల్లు కట్టుకుంటున్నాను, తన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగగా, ప్రమీలపై కాల్ మనీ, ఇతర కేసుల్లో ఇరికిస్తామని బెదిరించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రమీల తన ఇంట్లో చున్నీతో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తన చావుకు అప్పుతీసుకున్న నలుగురు వ్యక్తులే కారణమంటూ ఓ సూసైడ్ నోట్ కూడా రాసింది. ప్రమీల తండ్రి యాళ్ల బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వై.సుధాకర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

విత్తన రకం వరి పంట కోతకు సిద్ధం

ఎకరాకు 30 బస్తాల దిగుబడి వచ్చే అవకాశం

భీమవరం: జిల్లాలో సార్వా వరి మాసూళ్లకు సమయం ఆసన్నమైంది. దాళ్వా విత్తనాల కోసం సార్వాలో నాట్లువేసే వివిధ రకాల వరి పంట కోతకు సిద్ధమైంది. జిల్లా వ్యాప్తంగా సార్వా సీజన్‌లో సుమారు 2.18 లక్షల ఎకరాల్లో వరినాట్లు వేశారు. అయితే దాళ్వా విత్తనాల కోసం అనేక మంది రైతులు సార్వాలోనే పండించడం పరిపాటి. ఇందులో భాగంగా ప్రస్తుత సార్వా సీజన్‌లో దాళ్వా విత్తనాల కోసం రైతులు సుమారు ఐదు వేల ఎకరాల్లో ఎంటీయూ 1121, ఎంటీయూ 1156, ఎంటీయూ 1153, పీఆర్ 126 వంటి రకాలను నాట్లు వేయగా, కేవలం 1,800 ఎకరాలకు పైబడి ఎంటీయూ



1121 రకం వరినాట్లు వేసినట్టు వ్యవసాయశాఖ అంచనా. జిల్లాలోని రైతులు వరి విత్తనాలు ప్రభుత్వం అందించే విత్తనాలు కొనుగోలు చేయడం కంటే సొంతంగా పండించుకోవడం పైనే ఎక్కువగా శ్రద్ధ చూపిస్తారు. విత్తన రకం నాట్లు వేయని రైతులు తమకు సమీపంలో రైతులు పండించిన విత్తనాలు కొనుగోలు చేస్తుంటారు. ఈ ఏడాది సార్వా సాగు ప్రారంభమైన నాటి నుంచి అధిక వర్షాలు, వరదల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముందుగా వేసిన వరి నారుమళ్లు, నాట్లు నీట మునిగి నష్టపోయారు. దీంతో రెండు, మూడు పర్యాయాలు నాట్లు వేయాల్సి వచ్చింది. ముందుగా నష్టపోయిన రైతులకు ఇప్పటికీ పరిహారం అందలేదు. అయినప్పటికీ వారు వడ్డీ వ్యాపారులు వద్ద అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పైరు పెంచి పోషించారు. ముందుగా నాట్లువేసిన విత్తన రకాలు కొన్నిచోట్ల మాసూళ్లకు సిద్ధమయ్యాయి. విత్తన రకం ఎకరాకు 30 బస్తాల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. వాతావరణం అనుకూలిస్తే వచ్చే వారంతో కొందరు రైతులు విత్తన రకం మాసూళ్లు చేస్తామని చెబుతున్నారు.

ఆంధ్రా సుగర్స్ ఆధ్వర్యంలో దసరా వేడుకలు

తణుకు : తణుకు మండలం వెంకట్రాయపురం ఆంధ్రా సుగర్స్ ఆధ్వర్యంలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. స్థానిక సిల్వర్ జూబ్లీపార్కులో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన ఈ వేడుకలకు అంధ్రా సుగర్స్ సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య అధ్యక్షత వహించి మాట్లాడారు. పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటా మృతి యావత్ దేశానికి తీరని లోటన్నారు. ఆయనకు నివాళులర్పించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ప్రముఖ సినీ నటులు మాగంటి వేణుబెనర్జి, డాక్టర్ ధూళిపాళ పుత్రసత్య మహాదేవుడు మాట్లాడుతూ కుటుంబ విలువలు తగ్గిపోతున్న ప్రస్తుత తరుణంలో



వెంకట్రాయపురంలో మాట్లాడుతున్న మేనేజింగ్ డైరెక్టర్ అచ్యుతరామయ్య

సంస్థ ఉద్యోగులు ఒక కుటుంబంలా ఈ వేడుకలు జరుపుకోవడం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథులను సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ అడిషనల్ సెక్రటరీ పీవీఎస్ విశ్వనాథకుమార్, జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) ఎ.సాంబశివరావు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) పి.శ్రీనివాస్, సంస్థ ఉద్యోగులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వారే లేని.. నేనెందుకని..

భర్త, కొడుకుల మృతి తట్టుకోలేక మహిళ ఆత్మహత్య

పెదవేగి : రెండు రోజుల క్రితం కోడి పుంజులను ఈ కొట్టించేందుకు కాలువలోకి దిగిన భర్త, ఇద్దరు కుమారులు నీట మునిగి మృత్యువాత పడ్డారు. దీంతో ఆ కుంటుంబంలో మిగిలిన ఇల్లాలు జీవితంపై విరక్తి చెంది శుక్రవారం బలవన్మరణానికి పాల్పడింది. ఆ కుటుంబాన్ని మృత్యువు కబళించడంతో పెదవేగి మండలం కవ్వగుంటలో విషాదఛాయలు అలముకున్నాయి. స్థానికులు,



ఆత్మహత్య చేసుకున్న దేవి

పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కవ్వగుంటకు చెందిన శెట్టిపల్లి దేవి (38) శుక్రవారం ఉదయం తన ఇంటి వద్ద బాత్రూమ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గత రెండు రోజుల క్రితం ఆమె భర్త, ఇద్దరు పిల్లలు తమ ఇంటి సమీపంలో ఉన్న పోలవరం కుడి కాలువలో కోడి పుంజులను ఈదించడం కోసం దిగి ప్రమాదవశాత్తూ మునిగిపోయారు. వారి మృతితో ఒంటరి అయిన దేవి భర్త, పిల్లలు లేని జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడింది. దీంతో గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి.

బాలిక అనుమానాస్పద మృతి

మొగల్తూరు: ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిన బాలిక మృతి చెందినట్టు ఎస్సై జి.వాసు శుక్రవారం తెలిపారు. మొగల్తూరు మండలం రామన్నపాలెం పంచాయతీ పిప్పళ్ల వారితోటకు చెందిన తేజస్విని (14) ఈనెల 5వ తేదీ ఉదయం ఇంట్లో చెప్పకుండా బయటకెళ్లిందన్నారు. ఆమె తండ్రి గంగబాబు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు. తేజస్విని హైదరాబాద్‌లో మృతి చెందినట్టుగా ఈనెల 10వ తేదీ గురువారం ఉస్మానియా ఆసుపత్రి నుంచి సమాచారం అందడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్న ఓయువకుడితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం కావడంతో బాలిక హైదరాబాద్ వెళ్లినట్టు తెలిసిందన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

రఘురాంకు అభినందనలు


రఘురాంను కలిసి శుభాకాంక్షలు చెబుతున్న అలంపురం క్షత్రియ యువత

పెంటపాడు: వైఎస్సార్ సీపీ ద్వారా అన్ని వర్గాలతో పాటు, యువతకు ప్రత్యేక గుర్తింపు జగనన్న ద్వారానే సాధ్యమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు వడ్డి రఘురాం పేర్కొన్నారు. శుక్రవారం గూడెంలో తనను కలుసుకొన్న అలంపురం క్షత్రియ యువతతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రైతు నాయకునిగా ఎన్నుకొన్న రఘురాంను యువత ప్రత్యేకంగా అభినందించి బొకే అందించి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా యువతకు పలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో అలంపురం క్షత్రియ యువత నాయకులు కె. హరికృష్ణంరాజు, కె. జగదీష్‌వర్మ, ఎస్. సాయివర్మ, ఎస్. లోకేష్‌వర్మ, కె. శశీంద్ర వర్మ తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రతే అనారోగ్యాలకు కారకం

తణుకు అర్బన్: ఇంటి ఆవరణ అపరిశుభ్రతే అనారోగ్యాలకు కారకమని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని బండి వారి వీధిలో శుక్రవారం నిర్వహించిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్న విషయాన్ని అందరూ గ్రహించాలని కోరారు. నేటి రోజుల్లో చిన్న చిన్న నీటి నిల్వలను వారానికోసారి తొలగించుకునే డ్రైడే ఫ్రైడే కార్యక్రమంగా గుర్తించాలని స్పష్టం చేశారు. చెత్త, వ్యర్థాలను డ్రైనేజీల్లో పారవేయకుండా ఇంటి గుమ్మంలోకి వచ్చే పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. డ్రైనేజీల్లో మురుగు పారని పరిస్థితులు తలెత్తితే అవే దోమల ఆవాసాలని అన్నారు. దోమలను నివారించగలిగితే ఎటువంటి వ్యాధులు దరిచేరవని అన్నారు. ఈ సందర్భంగా ఇంటి ఆవరణల్లోని రుబ్బురోళ్లు, మొక్కల కుండీల్లో నిల్వ ఉన్న నీటి నిల్వలను ఇంటి యజమానులకు చూపించి సిబ్బంది తొలగింపచేశారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రటరీ డి.స్వర్ణకుమారి, హెల్త్ అసిస్టెంట్ ఎస్.తాతాజీ, ఆశ కార్యకర్త సీహెచ్ మహాలక్ష్మి పాల్గొన్నారు.

గూడెం మునిసిపాలిటీపై లోకాయుక్తకు ఫిర్యాదు

తాడేపల్లిగూడెం: గూడెం పురపాలక కార్యాలయంలో 2022 నుంచి 2024 వరకు అవకతవకలు జరిగాయంటూ లోకాయుక్తకు పట్టణానికి చెందిన వలవల మల్లికార్జునరావు అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు సదరు అధికారులు వివరాలు అందజేయాలంటూ పురపాలక సంఘం ప్రాంతీయ అధికారి కార్యాలయం నుంచి మునిసిపల్ కమిషనర్‌కు శుక్రవారం ఆదేశాలు వచ్చాయి. మునిసిపల్ అధికారులపై 27 ఆరోపణలు చేస్తూ మల్లికార్జునరావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సమాచారం సోమవారం ఉన్నతాధికారులకు పంపిస్తామని గూడెం మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు తెలిపారు.

మార్కెట్‌కు ఆర్థిక సంక్షోభం వచ్చిందా?

- దసరాలోనూ కొనుగోళ్లు లేక వ్యాపారాలు విలవిల
- మూతపడుతున్న దుకాణాలు
- గత జగన్ ప్రభుత్వంలో సంక్షేమంతో సుభిక్షం
- పెట్టుబడి కోసం అప్పులపాలవుతున్న వ్యాపారులు


తణుకులో కొనుగోలుదారులు లేక ఖాళీగా ఉన్న డ్రైఫ్రూట్స్ దుకాణం


తణుకులో ఖాళీగా ఉన్న రెడీమేడ్ దుస్తుల దుకాణం

తణుకు అర్బన్: దసరా పండుగ వస్తుందంటే చాలు కొనుగోళ్లు బాగుంటాయని వ్యాపారులు ఆశ పడడం సహజం. ప్రజానీకం తమకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసే పరిస్థితి ప్రతి ఏడాది కొనసాగుతూ ఉంటుంది. అటువంటిది ఈ ఏడాది వ్యాపార సంస్థలు, దుకాణాలు దసరా ముందునుంచి ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో వ్యాపారులు రాష్ట్రంలో ఆర్థికమాంద్యం ఏర్పడిందని ఏ ఒక్కరిని కదిపినా డబ్బులేదు అనే సమాధానం వస్తుందంటూ వాపోతున్నారు. ముఖ్యంగా వస్త్ర దుకాణాలతో పాటు రెడీమేడ్, ఫ్యాన్సీ, చెప్పుల దుకాణాలు, కిరాణా, ఫర్నిచర్, మిఠాయిలు, పండ్లు, బంగారు దుకాణాలన్నీ బేరాల్లేక అల్లాడిపోతున్నాయి. దసరా పండుగ అంటే కనకదుర్గమ్మ వారిని వివిధ అవతారాల్లో ముస్తాబు చేసే క్రమంలో బంగారు ఆభరణాల కొనుగోలుకోసం మహిళలు అధికశాతం ఆసక్తి చూపిస్తుంటారు. కానీ నేడు మాత్రం బంగారు దుకాణాలు సైతం బోణీ కాని రోజులు ఉన్నాయంటే వ్యాపారులు ముక్కునవేలేసుకుంటున్న పరిస్థితి. ప్రస్తుతం వ్యాపారాలు బాగోలేక దుకాణాల అద్దెలు కట్టలేక వ్యాపారస్థులు అల్లాడిపోతున్నారు. భారీ వ్యాపార సంస్థలు సైతం మూతపడే పరిస్థితి తణుకులో నెలకొంది. కోవిడ్ సమయంలో సైతం సంక్షేమ పథకాల సొమ్ము ప్రజలకు ఆసరాగా నిలచింది. అటువంటి విపత్తులోను ప్రజలు ఇంటిపట్టున ఉన్నా ఇబ్బందులు రాలేదని నేడు కరువు తాండవిస్తోందంటూ ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గడిచిన ఐదేళ్లు సుభిక్షంగా..

గత జగన్ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు మార్కెట్ సుభిక్షంగా సాగింది. సంక్షేమాన్ని పారదర్శకంగా అర్హులందరికీ అందజేయడంతో ప్రజలంతా తమకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసేందుకు తహతహలాడేవారు. దీంతో దుకాణాలన్నీ నిండుగా ఉంటూ వ్యాపారాలు కళకళలాడేవి. ముందుగానే విడుదల చేసిన క్యాలెండర్ ప్రకారం ప్రతి ఏడాది మహిళల ఖాతాల్లో వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించిన సొమ్మును జమచేయడంతో ప్రజల వద్ద డబ్బు చలామణీ అయ్యేది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోలు శక్తి పెరిగి దేశంలోనే మొదటి స్థానంలో నిలబడింది. అటువంటిది ఈరోజు ప్రజానీకం తిరిగి అప్పులపాలై పోయే పరిస్థితి దాపురించిందంటూ గగ్గోలుపెడుతున్నారు. మళ్లీ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మాదిరిగా వడ్డీ వ్యాపారస్థుల కోసం వెతుకులాట మొదలైందని వాపోతున్నారు.

చంద్రబాబు వస్తే కరువు రోజులే..


కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ మంత్రి

చంద్రబాబు పుణ్యమాని ఏపీ ప్రజలు నేడు తమ కుటుంబాలను పోషించుకునే క్రమంలో అప్పులు చేసేందుకు వడ్డీ వ్యాపారులకోసం వెతుకులాట మొదలుపెట్టారు. వ్యాపారరంగంలో ఇలాంటి కరువు రోజులు గతంలో ఎన్నడూ లేవు. గత జగన్ ప్రభుత్వం సంక్షేమంతో ప్రజలకు అండగా నిలబడితే నేటి చంద్రబాబు ప్రభుత్వం కుంటిసాకులతో చందాలు వసూలుచేస్తూ దందాలకు దిగి తమ జేబులు నింపుకునే పనిలో ఉన్నారు. జగన్ ప్రభుత్వంలో పేదలందరికీ సంక్షేమం ద్వారా అందించిన సొమ్ముతో మార్కెట్ సుభిక్షంగా ఉండేది. మార్కెట్‌లో కొనుగోలు శక్తి పెరిగి దేశానికే ఏపీ ఆదర్శంగా నిలిచేలా చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుంది. ఐదేళ్లపాటు ప్రజలు ఎంతో సుఖసంతోషాలతో తులతూగారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు రాగానే మరల ప్రజలు అప్పులుచేసేందుకు సిద్ధమవ్వాల్సి వస్తోంది. డబ్బు చలామణీకాక మార్కెట్ అంతా ఆర్థికమాంద్యం ఏర్పడినట్లుగా మారిపోయింది. దుకాణాలు కిటకిటలాడే రోజుల నుంచి బోణీ అయితేచాలు అనే పరిస్థితికి వచ్చాయి. ఇప్పటికే చాలా వ్యాపారాల మూతపడే స్థితికి వచ్చాయి.

ఇఫ్టూ రాష్ట్ర సదస్సు కరపత్రాల ఆవిష్కరణ

తాడేపల్లిగూడెం రూరల్: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు కోడ్‌లు, ప్రజావ్యతిరేక మూడు నేర చట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న విజయవాడలో జరగనున్న ఇఫ్టూ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దానవరప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని పెదతాడేపల్లి రైస్ మిల్లు వద్ద ఇఫ్టూ రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దానవరప్రసాద్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలని, మోటార్ హమాలీ తదితర అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. రాష్ట్రంలో వరద బాధితులకు వాస్తవ నష్టాల ఆధారంగా సహాయం ప్రకటించాలని, ఆటోలకు ప్రకటించిన పరిహారాన్ని రూ.25వేలను పెంచాలని తదితర డిమాండ్స్ సాధనకు విజయవాడలో సదస్సు జరుగుతుందన్నారు. సదస్సును కార్మికవర్గం ఎక్కువ శాతం హాజరై సదస్సులు జయప్రదం చేయాలన్నారు. వెంకట్రావు, నాగేశ్వరరావు, ముసలయ్య, రామకృష్ణ, నరేష్, రాము, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆయుధ పూజ

తాడేపల్లిగూడెం: దసరా ఉత్సవాలలో భాగంగా శుక్రవారం పట్టణ పోలీసు స్టేషన్‌లో సీఐ సుబ్రహ్మణ్యం ఆయుధ పూజచేశారు. మహార్నవమి రోజున ఆయుధపూజ చేస్తే శుభ ఫలితాలు కలుగుతాయన్నారు. గూడెం పట్టణంలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా ఉండాలని అమ్మవారిని కోరుకున్నామన్నారు. పట్టణ ప్రజలు, వ్యాపారులు పోలీసులకు సహకరించాలన్నారు. దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో ఎలాంటి ప్రమాదాలు లేకుండా పండుగ చేసుకోవాలన్నారు.

ఇక ఫుల్ కిక్కు!

- ముగిసిన మద్యం షాపుల దరఖాస్తుల స్వీకరణ


తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ కార్యాలయం

తణుకు: ప్రైవేటు మద్యం దుకాణాలను దక్కించుకోవడానికి పోటీ ముగిసింది. ఇప్పటి వరకు ఈ రంగంలో లేనివారు కూడా దరఖాస్తు చేస్తున్నారు. ఈనెల 1వ తేదీన దరఖాస్తుల నమోదు ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ వారం రోజుల పాటు మందకొడిగా సాగింది. రెండు రోజులుగా దరఖాస్తుల సంఖ్య క్రమంగా పెరిగి శుక్రవారం రాత్రి 7 గంటలతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం పరిధిలోని తణుకు మున్సిపాల్టీతోపాటు తణుకు, ఇరగవరం, పెనుగొండ, పెనుమంట్ర మండలాల్లో మొత్తం 33 మద్యం షాపులకు సంబంధించి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే శుక్రవారం రాత్రి గడువు ముగిసే సమయానికి మొత్తం 876 దరఖాస్తులు రాగా ఫీజుల రూపంలో రూ. 17.52 కోట్లు రాబడి వచ్చింది. ఈనెల 12, 13 తేదీల్లో దరఖాస్తులను పరిశీలించి 14న ఉదయం భీమవరంలో కలెక్టర్ సమక్షంలో లాటరీ తీసి దుకాణాలు కేటాయిస్తారు. 16 నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు అందుబాటులోకి వస్తాయి.

తణుకులోనే ఎక్కువ పోటీ...

తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని తణుకు మున్సిపాల్టీతోపాటు తణుకు, ఇరగవరం, పెనుగొండ, పెనుమంట్ర మండలాలు ఉన్నాయి. అయితే తణుకు మున్సిపల్ పరిధిలోని 9 షాపులకుగాను 239 దరఖాస్తులు దాఖలయ్యాయి. ఇక్కడ ఎక్కువ వ్యాపారం జరుగుతుందని వ్యాపారులు భావిస్తున్నారు. బాగా ఆదాయం వచ్చే షాపుల వివరాలను సేకరించి వాటిని చేజిక్కించుకునేందుకు పోటీ పడుతుండటంతో అత్యధికంగా దరఖాస్తులు వచ్చాయి. ఎవరికి లాటరీ తగిలినా కలిసి చేసుకుంటే నాలుగు రూపాయిలు మిగులుతాయని లేకుండా నష్టపోతామని సిండికేట్‌లో భాగస్వాములుగా ఉన్న మద్యం వ్యాపారులు భావిస్తున్నారు. మొత్తం 33 షాపులకు గాను ఏడాదికి రూ. 65 లక్షలు లైసెన్సు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. రెండో ఏడాది ఒక దుకాణంపై 15 శాతం లైసెన్సు రుసుం అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. దీంతో మొదటి ఏడాది రూ. 65 లక్షలు చెల్లించాల్సిన షాపులు రూ. 71.50 లక్షలు చెల్లించాలి.

గూడెంలో మద్యం షాపులకు దరఖాస్తుల వెల్లువ

తాడేపల్లిగూడెం: ఒక దుకాణానికి సరాసరి 33 దరఖాస్తులు వచ్చాయి. గూడెం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 36 దుకాణాలకు గాను గడువు ముగిసేసరికి శుక్రవారం సాయంత్రానికి 1,222 దరఖాస్తులు అందాయి. దుకాణాలకు రుసుం కింద రూ.24 కోట్ల 44 లక్షలు ప్రభుత్వానికి డీడీల రూపంలో వచ్చాయి. గూడెం మండలంలో ఆరు దుకాణాలకు 287 దరఖాస్తులు, గూడెం పట్టణంలో 11 దుకాణాలకు 332 దరఖాస్తులు అందాయి. పెంటపాడు మండలంలో ఎనిమిది షాపులకు 181 దరఖాస్తులు వచ్చాయి. గణపవరం మండలంలో నాలుగు దుకాణాలకు 221 దరఖాస్తులు అందాయి. అత్తిలి మండలంలో ఏడు దుకాణాలకు 201 దరఖాస్తులు వచ్చినట్టు సీఐ కల్యాణ్ చక్రవర్తి తెలిపారు.

'మానవత' ఆర్థిక సాయం


వేల్పూరులో బాధితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

తణుకు టౌన్: మండలంలోని వేల్పూరు గ్రామంలో ఇటీవల జరిగిన ట్రాక్టర్ ప్రమాద బాధితుడికి మానవత సంస్థ, ఇతర దాతలు కలసి రూ. 30వేలు ఆర్థిక సహాయం అందజేసినట్లు తణుకు మానవత సంస్థ అధ్యక్షురాలు కఠారి శారదాదేవి తెలిపారు. శుక్రవారం సాయంత్రం వేల్పూరులోని బాధితుడు తమరాడ భానుప్రకాష్ నివాసంలో అతనిని పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం దాతలు మన్యం ఇందిరాదేవి, హైదరాబాద్‌కు చెందిన వెలిచేటి రవిప్రకాష్, శాఖమూడి శివ గంగాధర్ శరత్‌కుమార్ అందజేసిన రూ. 15 వేలతో పాటు మానవత సంస్థ అందజేసిన రూ.15 వేలు మొత్తం రూ. 30 వేల చెక్కును బాధితునికి అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా కన్వీనర్‌లు బీ రామలక్ష్మీ, ఎస్వీ సతీష్ బాబు, కార్యదర్శి బీ రామకాశీ, అక్కాపంతుల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ఉచిత భిక్ష

తణుకు అర్బన్: తణుకు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న శ్రీధర్మ శాస్త్ర పంచాయతన అయ్యప్పస్వామి ఆలయంలో మాలదారులకు ఉచిత భిక్ష ప్రారంభించారు. దాతల సహకారంతో ఈ ఉచిత భిక్ష వచ్చే ఏడాది జనవరి 10వ తేదీ వరకు వందరోజులపాటు కొనసాగుతుందని గురుస్వామి భరణి చెప్పారు. నిత్యం ఎంతమంది మాలదారులు వచ్చినా అందరికీ భిక్ష ఏర్పాటు చేస్తామని, గత 8 ఏళ్లుగా ఆలయంలో ఉచిత భిక్షను దేదీప్యమానంగా కొనసాగిస్తున్నట్లు వివరించారు.

దుర్గమ్మా కరుణించమ్మా...


అత్తిలి: ఆరవల్లిలో శ్రీమహిషాసురమర్దనిగా కనకదుర్గమ్మ


తాడేపల్లిగూడెం రూరల్: వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరీ అమ్మవారిని సిద్ధిదాత్రిగా అలంకరించిన దృశ్యం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు చివరి దశకు చేరుకున్నాయి. దీంతో అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. శుక్రవారం వివిధ అవతారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి దుర్గాదేవి కరుణించమ్మా అని మొక్కులు చెల్లించుకున్నారు. భజనలు, అన్నప్రసాద వితరణలు జరిగాయి. ప్రజాప్రతినిధులు, నాయకులు దుర్గమ్మను దర్శించుకున్నారు.

\- సాక్షి, నెట్‌వర్క్

కెనరా బ్యాంక్ Canara Bank — చాటపర్రు బ్రాంచ్ (1330), మెయిన్ రోడ్డు, చాటపర్రు, ఏలూరు మండలం, ప.గో॥ జిల్లా-534004. ✆8331015651

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

[illegible]

ఇ-వేలం తేది & సమయం: 13-11-2024. ఉ॥ 10.30 గం.ల నుండి 11.30 ని॥ల వరకు

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును ఆర్.టి.జి.ఎస్/నెఫ్ట్/ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా కెనరా బ్యాంక్, చాటపర్రు బ్రాంచ్ ఖాతా నెం. 209272434, ఐ.ఎఫ్.ఎస్.సి కోడ్: CNRB0001330కు తేది: 11-11-2024, సా॥ 5.00 గం.ల లోపుగా చెల్లించవలెను.

1	ఋణగ్రహీత: శ్రీ ద్వార మధు సత్య సాయి కుమార్ [illegible] ... బకాయి మొత్తం: తేది. 30-09-2024 నాటికి రూ. 32,03,782.50/- + [illegible] ... రిజర్వు ధర: రూ.16,98,000/- ధరావత్తు సొమ్ము: రూ.1,70,000/-
2	ఋణగ్రహీత: [illegible] ... తేది.30-09-2024 నాటికి బకాయి మొత్తం: రూ. 1,14,14,986.5/- [illegible] ... రిజర్వు ధర: రూ.13,75,000/- ధరావత్తు సొమ్ము: రూ.1,37,500/-
3	ఋణగ్రహీత: [illegible] ... తేది.30-09-2024 నాటికి బకాయి మొత్తం: రూ. 65,38,737.30/- [illegible] ... రిజర్వు ధర: రూ.27,50,000/- ధరావత్తు సొమ్ము: రూ.2,75,000/-
4	ఋణగ్రహీత: [illegible] ... తేది.30-09-2024 నాటికి బకాయి మొత్తం: రూ. 39,34,574.8/- [illegible] ... రిజర్వు ధర: రూ.15,68,000/- ధరావత్తు సొమ్ము: రూ.1,56,800/-

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో పొందుపరచిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, చాటపర్రు బ్రాంచ్, మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 08812-231063, మొబైల్ నెం. 8331015651 ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (Ebkray), వెబ్‌పోర్టల్ https://ebkray.in హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.ebkray@psballiance.com

తేది: 11-10-2024. ప్రదేశం: చాటపర్రు — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్